సాక్షి
మెదక్
ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



ఆభరణాలు అప్పగింత

తనకు దొరికిన బంగారు, వెండి ఆభరణా లను యువతి పోలీసులకు అప్పగించింది.

వివరాలు IIలో ▸



శిథిలావస్థలో పాఠశాలలు

ప్రభుత్వ పాఠశాలలు శిథిలావస్థకు చేరి అధ్వానంగా మారాయి.

వివరాలు IIIలో ▸



క్రీడలతో మానసికోల్లాసం

క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడ తాయని పలువురు అధికారులు పేర్కొన్నారు.


వివరాలు IIIలో ▸

మళ్లీ నిరాశే..

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా జిల్లాకు సంబంధించి కేటాయింపులు ఏమి జరగలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉద్యోగులకు మాత్రం కొంత ఊరట కలిగించింది. మొత్తంగా బడ్జెట్‌లో సామాన్యుడికి మేలు కలిగించే అంశాలు లేకపోవడంపై పెదవి విరుస్తున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు మొండిచెయ్యి

- వేతన జీవులకు కొంత ఊరట
- ఊసేలేని విద్యాలయాలు
- ప్రస్తావనకు రాని ట్రిపుల్‌ఆర్



మెదక్‌జోన్: కేంద్ర బడ్జెట్ జిల్లాకు ప్రత్యేకమైన కేటాయింపులేమి లేవు. ఈసారైనా ఉన్నత విద్యకు అవకాశం లభిస్తుందని ఆశగా ఎదురు చూసిన ప్రజలకు నిరాశే మిగిలింది. నవోదయ, సైనిక్, కేంద్రీయ విద్యాలయాల ఊసే లేకుండా పోయింది. బడ్జెట్‌లో ట్రిపుల్‌ఆర్‌కు కేటాయింపులు ఉంటాయని ప్రచారం జరిగినప్పటికీ.. అలాంటిదేమి జరగలేదు. రీజినల్ రింగు రోడ్డు జిల్లాలో నర్సాపూర్ నుంచి మొదలుకుని శివ్వంపేట, తూప్రాన్ మండలాల పరిధిలో ఉండగా.. ఇప్పటికే భూసేకరణ విషయంలో రైతుల నుంచి నిత్యం నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. కాగా ఈ బడ్జెట్‌లో కేటాయింపులు జరిగితే భూసేకరణ వేగంగా జరిగే అవకాశాలు ఉండేవి. మెదక్ ప్రధాన రహదారి చేగుంట వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్వోబీ)కి సంబంధించి బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు జరగలేదు. కానీ ఇందు కోసం ప్రత్యేకంగా గ్రాంట్ మంజూరు చేయించి త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్ రావు 'సాక్షి'తో పేర్కొన్నారు.

ఆదాయ పన్ను మినహాయింపు

వార్షిక ఆదాయం రూ. 12 లక్షల వరకు ఉన్న వ్యక్తులకు పన్ను మినహాయింపు ఇస్తున్నట్లు కేంద్రం బడ్జెట్‌లో పొందుపరిచింది. దీంతో జిల్లావ్యాప్తంగా 15 వేల మంది పైచిలుకు వ్యక్తులకు లబ్ధి చేకూరనుంది. ఇందులో 5 వేల వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉండగా, 10 వేల మంది ఇతరులు ఉన్నారు.

కిసాన్ క్రెడిట్ కార్డుతో రైతులకు మేలు

కిసాన్ క్రెడిట్ కలిగిన రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ. 5 లక్షల వరకు రుణాలు ఇవ్వనున్నట్లు బడ్జెట్‌లో పేర్కొనడంతో జిల్లాలో లక్షలాది మంది రైతులకు లాభం చేకూరనుంది. జిల్లావ్యాప్తంగా 3.92 లక్షల ఎకరాల వ్యవసాయ భూములు ఉండగా, 2.91 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరిలో ఇప్పటికే 1.70 లక్షల మంది రైతులు కిసాన్ క్రెడిట్ కార్డులు కలిగి ఉన్నారు. ఇంకా 1.21 లక్షల మందికి కార్డులు లేవు. ప్రస్తుతం వీరందరూ కార్డులు పొందే అవకాశం ఉంది. అలాగే గతంలో కిసాన్ క్రెడిట్ కార్డుపై ఎలాంటి షరతులు లేకుండా రూ. 3 లక్షల రుణాలు ఇవ్వగా.. ఇక నుంచి రూ. 5 లక్షల వరకు రుణాలు ఇవ్వనున్నారు.

గ్రామీణాభివృద్ధికి పెద్దపీట

బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశారు. రూ. 2.66 లక్షల కోట్లు కేటాయించడంతో జిల్లాలోని ఉపాధి కూలీలకు మేలు చేకూరనుంది. జిల్లాలో 1.64 లక్షల జాబ్‌కార్డులు ఉండగా, 3.31 లక్షల మంది కూలీలు ఉన్నారు. వీరందరికి నిత్యం ఉపాధి లభించనుంది.

బడ్జెట్ నిరాశకు గురి చేసింది



నర్సాపూర్: కేంద్ర బడ్జెట్ పేదలు, సామాన్య ప్రజలను నిరాశకు గురి చేసింది. ఎరువులు, విత్తనాలకు సబ్సిడీ పెంచకపోగా కోతలు పెట్టారు. రైతులకు అండగా నిలవకపోవడం విచారకరం. పీఎం కిసాన్ కింద రైతులకు అందచేసే ఆర్థిక సహాయం పెంచలేదు. తెలంగాణపై బీజేపీ వివక్ష స్పష్టమైంది.

\- సునీతారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే

ఆమోదయోగ్యమైన బడ్జెట్



ఈ బడ్జెట్ బడుగు, బలహీనవర్గాలతో పాటు రైతులు, మధ్య తరగతి, వేతన జీవులకు ఎంతో ఆమోదయోగ్యమైనది. అన్నివర్గాల ప్రజ లకు లబ్ధి చేకూరనుంది. ముఖ్యంగా వార్షిక ఆదాయం రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం ఊరటనిచ్చే అంశం.

\- శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

అతికొద్ది మందికే ఊరట



రూ. 12 లక్షల వరకు పన్ను రాయితీ అతికొద్ది మంది వేతన జీవులకు మాత్రమే ఊరటనిచ్చే అంశం. ఇది కొత్తగా రిక్రూట్‌మెంట్ అయిన వారికే లాభం, పాతవారికి ఏ మాత్రం యోగ్యంగా లేదు. అంతే కాకుండా సీపీఎస్, హెచ్ ఆర్‌ఏ, రుణం మినహాంపు ఉంటుందా..? అనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు.

\- మల్లారెడ్డి, ఉపాధ్యాయుడు

మొండి చెయ్యి చూపారు



ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు ఒక వి ధంగా, లేని రాష్ట్రాలకు మరోరకంగా కేంద్రం బడ్జెట్‌లో కేటాయింపులు చేసింది. తెలంగాణ ప్రస్తావనే లేకుండా చేసింది. ఏపీ, ఢిల్లీ, బీహార్ రాష్ట్రాల కోసమే బడ్జెట్ ప్రవేశ పెట్టింది. పెద్దన్న పాత్ర పోషించాల్సిన కేంద్రం.. స్వార్థపూరితంగా వ్యవహరించింది.

\- పద్మారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు

ఇది కోతల బడ్జెట్



కేంద్ర బడ్జెట్ కార్మికులకు అన్యాయం, కార్పొరేట్లకు వత్తాసు పలికేలా ఉంది. పేదలు, రైతులకు సబ్సిడీలను తగ్గించారు. ఆహార భ ద్రతకు కేటాయింపులు కుదించారు. యూరియా సబ్సిడీ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, పెన్షన్లు ఇలా అన్నింటిలోనూ కోతలు పెట్టింది.

\- నర్సమ్మ, సీపీఎం జిల్లా కార్యదర్శి

శభాష్.. రమేశ్

మాటలు రావు.. చెవులు వినపడవు

- అయినా క్రికెట్‌లో సత్తా చాటుతున్న యువకుడు
- ఆదర్శంగా నిలుస్తున్న న్యాల్‌కల్ వాసి

సండే స్పెషల్



సమస్యలొచ్చినప్పుడు పారిపోకుండా వాటిని ఎదురించి సవాల్‌ను స్వీకరించినప్పుడే పోరాట యోధుడు అవుతారు. అలా తనకున్న లోపాలను మలుచుకొని సమస్యలను జయించి నిలిచాడు న్యాల్‌కల్‌కు చెందిన బోడ రమేశ్. ప్రస్తుతం ఆల్ ఇండియా అసోసియేషన్ టీమ్‌లో ప్లేయర్‌గా కొనసాగుతున్నాడు. బాల్యం నుంచి కష్టాల బాటలోనే నడిచాడు. పుట్టుకతోనే మాటలు రాకపోవడం, చెవులు వినకపోవడంతో పాటు కటిక పేదరికం అతనిది. ఖాళీ సమయంలో స్వగ్రామంలోనే టీ కొట్టు నడుపుతున్నాడు. ఇలా తనకు ఎదురైన సమస్యలను జయించుకుంటూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రికెట్‌లో రాణిస్తున్నాడు. సమస్యలు ఎన్ని ఉన్నా పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తున్న క్రీడాకారుడు రమేశ్‌పై సాక్షి ప్రత్యేక కథనం...

సంగారెడ్డి జోన్

IIలో

న్యూస్‌రీల్

హెల్ప్‌డెస్క్ ద్వారా వినతుల స్వీకరణ

మెదక్ కలెక్టరేట్: రేపటి ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా హెల్ప్‌డెస్క్ ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా అధికారులకు ఎమ్మెల్సీ ఎన్నికల విధులు కేటాయించినందున అందుబాటులో ఉండరని తెలిపారు. ప్రజలు సమస్యలపై హెల్ప్‌డెస్క్‌కు ఫిర్యాదులు అందించాలని సూచించారు.

షీటీంతో మహిళలకు రక్షణ

మెదక్ మున్సిపాలిటీ: షీటీం ఆధ్వర్యంలో బాలికలు, మహిళలకు మరింత రక్షణ కల్పించేలా చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరిలో జిల్లావ్యాప్తంగా115 హాట్‌స్పాట్‌లను 200 సార్లు తనిఖీ చేసినట్లు తెలిపారు. అలాగే 29 మంది ఆకతాయిలకు కౌన్సెలింగ్ చేసి, రెండు కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ బడుల్లో 33 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు.

బడ్జెట్ ప్రతుల దహనం

మెదక్ కలెక్టరేట్: కేంద్ర బడ్జెట్ అభివృద్ధిని బలహీన పర్చేలా ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొరెంకల మల్లేశం ఆరోపించారు. శనివారం మెదక్‌లో బడ్జెట్ పత్రాలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజుతో కలిసి మాట్లాడారు. దేశ అభివృద్ధిని బలహీనపరిచే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం సరికాదన్నారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీహార్‌కు వరాలు.. తెలంగాణకు మొండి చేయి చూపెట్టారని విమర్శించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సంతోష్, సత్యం, భాను, అజయ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా



మాట్లాడుతున్న నాయకులు

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన పట్టణాధ్యక్షుడు గజవాడ నాగరాజు, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు సరాపు యాదగిరి, మరో సీనియర్ నాయకుడు చింతల యాదగిరి శనివారం పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో రామాయంపేట మున్సిపాలిటీ ఎంతమాత్రం అభివృద్ధి సాధించలేదన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌తోనే అభివృద్ధి జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యేతో మాట్లాడి త్వరలో కాంగ్రెస్‌లో చేరుతామని ప్రకటించారు.

సమయపాలన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: సమర్థవంతమైన పాలనకు ఈ–ఆఫీస్ విధానం దిక్సూచిగా పనిచేస్తుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సుపరిపాలన అందించే దిశగా అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. ఈ ఆఫీస్ విధానం పగడ్బందీగా అమలు జరగాలన్నారు. ఇది సమర్థవంతమైన పాలనకు దిక్సూచిగా పనిచేస్తుందని తెలిపారు. కలెక్టర్‌తో సహా ప్రతి ఆఫీసర్‌పై జవాబుదారితనం పెరుగుతుందన్నారు. అధికారులు, సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా పర్యటించాలని, తూచా తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. సామాజిక రుగ్మతలను నియంత్రించడంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఎన్నికల నిబంధనలు కట్టుదిట్టం

హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులతో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో ఎన్నికల నియమావళికు సంబంధించి కట్టుదిట్టమైన నిబంధనలను అమలు చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు రమాదేవి, మహిపాల్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీపీఓ యాదయ్య, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రోన్ వచ్చేసింది



- రామాయంపేట సొసైటీకి అందజేసిన ఇఫ్కో
- రైతులకు అందుబాటులో సేవలు

రామాయంపేట(మెదక్): వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులకు ఆశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. ఆధునిక సేవలతో పాటు నూతన సాంకేతిక పద్ధతులతో రైతులు సాగు చేసుకునే విధంగా తోడ్పాటు అందిస్తున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోనే ప్ర ప్రథమంగా రామాయంపేట సహకార సంఘానికి ఇఫ్కో సంస్థ రూ. 20 లక్షలు విలువ చేసే డ్రోన్, ట్రాలీ ఆటోను అందజేసింది. డ్రోన్ పైలట్‌గా మండలంలోని శివాయపల్లికి చెందిన యువరైతు శ్రీకాంత్‌కు శిక్షణ సైతం అందించింది. తెగులు సోకిన పంట చేలపై నేరుగా క్రిమి సంహారక మందులు పిచికారీ చేసి రైతులు అనారోగ్యం బారిన పడుతున్నారు. డ్రోన్ అందుబాటులోకి రావడంతో సమయంతో పాటు కూలీల ఖర్చు తప్పనుంది. నీటి, వాతావరణ కాలుష్యం దెబ్బతినే ప్రమాదం ఉండదు. ముందుగా రైతులు తమ పేర్లు నమోదు చేయించుకొని నామమాత్రపు అద్దెతో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. ఈ మేరకు రామాయంపేట వ్యవసాయ సంచాలకులు రాజ్‌నారాయణ మాట్లాడుతూ.. రైతులు పాత పద్ధతులతో క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తే తగిన మోతాదు కంటే ఎక్కువ లేదా తక్కువ వినియోగించే అవకాశం ఉంటుందని.. డ్రోన్ వినియోగంతో దానికి ఆస్కారం ఉండదని చెప్పారు. అతి తక్కువ సమయంలో పనులు పూర్తి కావడంతో పాటు కూలీల ఖర్చు ఆదా అవుతాయన్నారు. రైతులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



సహకార సంఘానికి డ్రోన్ అందజేస్తున్న అధికారులు

జ్ఞానదాయిని.. విద్యాసరస్వతి



రేపే వసంత పంచమి.. సర్వం సిద్ధం

- సర్వాంగ సుందరంగా వర్గల్ క్షేత్రం
- పోటెత్తనున్న భక్తులు.. విస్తృత ఏర్పాట్లు



సరస్వతి అమ్మవారు

వర్గల్(గజ్వేల్): రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న వర్గల్ విద్యా సరస్వతి క్షేత్రం వసంత పంచమి మహోత్సవానికి ముస్తాబైంది. చిన్నారులకు జ్ఞానం ప్రసాదించే అక్షరాభ్యాస కేంద్రంగా, భక్తజనావళి కోరిన కోర్కెలు తీర్చే మహిమాన్విత క్షేత్రంగా భాసిల్లుతున్న సరస్వతి సన్నిధానాన్ని సోమవారం మహోత్సవం సందర్భంగా సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఆలయాల సమాహారం

క్షేత్రంలో శనీశ్వరాలయం, లక్ష్మీగణపతి ఆలయం, స్వయంభు శంభులింగేశ్వరాలయం, సుబ్రహ్మణ్యేశ్వ రాలయం, కల్యాణ వేంకటేశ్వరాలయం, శారదాచంద్రమౌళీశ్వరాలయాలు కొలువుదీరాయి. కొండపైన 14 అడుగుల ఎత్తైన వీణాపాణి విగ్రహం ఉంది.

క్షేత్రంలో విస్తృత ఏర్పాట్లు

చిన్నారుల అక్షరస్వీకారాలకు, ఉత్సవ వేడుకలు తిలకించేందుకు వర్గల్ క్షేత్రానికి భక్తులు పోటెత్తనున్నారు. ఈ సందర్భంగా క్షేత్రాన్ని సుందరంగా అలంకరించారు. విద్యుత్‌దీపాలు వరుసలు ఏర్పాటు చేశారు. ఇందుకోసం కొండ దిగువ నుంచి ప్రత్యేక క్యూలైన్లు, బారికేడ్లు, చలవపందిళ్లు ఏర్పాటుచేశారు. ప్రతి 45 నిమిషాలకు 500 అక్షరాభ్యాసాలు జరిగేలా శ్రీనివాసమ్, శారదీయమ్, సారస్వత మ్ మండప ప్రాంగణాలను సిద్ధం చేశారు.

క్షేత్రానికి ప్రత్యేక బస్సులు..

హైదరాబాద్‌కు 50 కిలోమీటర్ల దూరంలోని వర్గల్ క్షేత్రానికి సికింద్రాబాద్ గురుద్వార్ నుంచి ప్రతి గంటకు బస్సు చొప్పున హకీంపేట ఆర్టీసీ డిపో బస్సులు నడుస్తాయి. వీటితోపాటు వసంత పంచమి సందర్భంగా 2, 3 తేదీలలో మేడ్చల్, గజ్వేల్ డిపోబస్సులు కూడా నడుస్తాయని ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖరసిద్ధాంతి తెలిపారు. వాహనాల పార్కింగ్ ప్రదేశం నుంచి భక్తులు క్యూలైన్ వద్దకు చేరుకునేందుకు ఉచిత ఆటోలు, నీడ కోసం చలవపందిళ్లు ఏర్పాటు చేశామన్నారు. తాత్కాలికంగా విశాలమైన ప్రాంగణంలో ఉచిత అన్నదాన ప్రసాద మండపాలు ఏర్పాటుచేసినట్లు వివరించారు. ఉత్సవాలకు పీఠాధిపతులు హాజరుకానున్నారని, మంత్రులు తదితర ప్రముఖులకు ఆహ్వానపత్రాలు అందజేశామని వివరించారు. క్షేత్రంలో భక్తులకు ఇబ్బందికలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు.

జాతీయస్థాయిలో ప్రతిభ చూపాలి

మెదక్ మున్సిపాలిటీ: రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో పతకాలు సాధించి జిల్లాకు వచ్చిన పోలీస్ క్రీడాకారులకు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి శనివారం ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన మూడవ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడల్లో జిల్లా పోలీసులు రికార్డు సృష్టించారని తెలిపారు. ఏకంగా 8 పతకాలను సాధించారన్నారు. ఇందులో 1 బంగారు పతకంతో పాటు 2 రజితం, 5 కాంస్య పతకాలను ఉన్నాయన్నారు. మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, కానిస్టేబుల్స్ రాజశేఖర్, రమేష్, సంగ్రామ్‌లను ఎస్పీ అభినందించారు. ఇదేవిధంగా జాతీయస్థాయిలో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పతకాలు సాధించిన సిబ్బందితో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

నారు.. అమ్మకాల జోరు

నర్సాపూర్: నర్సాపూర్ అంగడిలో నారు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మెదక్, నల్గొండ ప్రాంతాలకు చెందిన పలువురు రైతులు పలు రకాల నారు తెచ్చి ప్రతి శుక్రవారం విక్రయిస్తున్నారు. నారు పెంచే అవకాశం లేని రైతులు కొనుగోలు చేస్తున్నారు. నర్సాపూర్ సమీప గ్రామాల రైతులు కూరగాయలు, ఉల్లి, టమాట, వంకాయ, మిరుప తదితర పంటల నారు అమ్ముతున్నారు. కాగా కోతుల బెడదతో పంటలు సాగు చేయలేకపోతున్నామని, బతకడానికి ఏదో ఒక పంట పండించాలన్న ఉద్దేశంతో నారు అమ్ముతూ కుటుంబాలను పోషించుకుంటున్నామని చెబుతున్నారు. కాగా మెదక్ మండలం భూపతిపూర్ నుంచి సుమారు 10 మంది, నల్గొండ నుంచి ఇద్దరు రైతులు ఆయా రకాల నారు తెచ్చి సంతలో విక్రయిస్తున్నారు. ఇక్కడ మిగిలిన నారును మరో అంగడికి తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. నర్సాపూర్‌తో పాటు తూప్రాన్, కామారెడ్డి, గజ్వేల్, భిక్కనూర్ తదితర సంతలు తిరిగి నారు అమ్ముతున్నారు.



నర్సాపూర్ అంగడిలో నారు విక్రయాలు

క్లుప్తంగా

ఫిట్స్‌తో వివాహిత మృతి

45 రోజుల క్రితమే వివాహం

పటాన్‌చెరు టౌన్‌: స్నానం చేసేందుకు బాత్ రూంలోకి వెళ్లిన వివాహిత ఫిట్స్ రావడంతో కిందపడి మృతి చెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నిజాంపేట్‌కు చెందిన నాగలక్ష్మిని 45 రోజుల క్రితం అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఐలాపూర్‌కు చెందిన దర్శన్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం స్నానం చేసేందుకు నాగలక్ష్మి బాత్ రూంలోకి వెళ్లి ఎంతసేపటికీ రాకపోవడంతో అత్త రాములమ్మ స్థానికుల సహకారంతో బాత్ రూమ్ డోర్ తెరిచే చూడగా ఫిట్స్ రావడంతో పడిపోయి ఉంది. దీంతో వెంటనే అంబులెన్స్‌కు కాల్ చేయగా వారు వచ్చి పరిశీలించి మృతి చెందిందని చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ మృతి


నరేశ్ (ఫైల్)

గజ్వేల్‌రూరల్‌: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని దాతర్‌పల్లిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొత్తపల్లి నరేశ్ గతనెల 14న దాతర్‌పల్లి నుంచి గజ్వేల్ వైపు తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రజ్ఞాపూర్ శివారులోని రింగురోడ్డు వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు సికింద్రాబాద్‌లోని యశోదా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు

నర్సాపూర్ రూరల్‌: నర్సాపూర్ రాయరావు చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైనట్లు ఎస్సై లింగం తెలిపారు. పట్టణానికి చెందిన నూనె రాకేష్ (30) భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెంది గురువారం రాత్రి రాయరావు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, ఫైర్ సిబ్బంది, గజ ఈతగాళ్ల సహకారంతో రెండు రోజులుగా గాలింపు చెప్పట్టగా శనివారం మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

శభాష్.. రమేశ్


ప్రశంసాపత్రాలు, కప్‌లతో క్రీడాకారుడు రమేశ్

- మాటలు రావు.. చెవులు వినపడవు
- క్రికెట్‌లో సత్తా చాటుతున్న యువకుడు
- ప్రస్తుతం ఆల్ ఇండియా క్రికెట్ అసోసియేషన్‌లో ప్లేయర్
- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ
- ఖాళీ సమయంలో హోటల్ నడిపిస్తూ జీవనం
- తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ముందుకు
- ఆదర్శంగా నిలుస్తున్న న్యాల్‌కల్‌కు చెందిన బోడ రమేశ్

సండే స్పెషల్

సంగారెడ్డి జోన్‌: పట్టుదల ఉంటే చాలు ఎంతటి కష్టాన్ని అయినా జయించవచ్చు. పుట్టుక నుంచే మాట రాదు.. చెవులు వినిపించవు.. నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆ యువకుడి విజయం ముందు అన్నీ తలవంచక తప్పలేదు. న్యాల్‌కల్ మండల కేంద్రం గ్రామానికి చెందిన బోడ రమేశ్ పట్టుదలతో తన లోపాలనే ఆయుధంగా మలుచుకొని క్రికెట్‌లో జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి ఆల్ ఇండియా అసోసియేషన్ టీమ్‌లో ప్లేయర్‌గా ఉన్నాడు.

మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామంలోని బోడ భాగమ్మ, బోడ లింగయ్య దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. నాలుగో కుమారుడు బోడ రమేశ్. పుట్టుకతోనే మాటలు రాకపోవడం, చెవులు వినిపించేవి కావు. అయినా తల్లిదండ్రులతోపాటు ఆ యువకుడు ఏ మాత్రం వెనుకడుగు వేయలేదు. అందరి లాగానే జీవించాలన్న లక్ష్యంతో హైదరాబాద్‌లో సంబంధిత దివ్యాంగుల పాఠశాలతోపాటు కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. అదే విధంగా కంప్యూటర్ కోర్సును పూర్తి చేశాడు. ప్రస్తుతం స్వగ్రామంలోని మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో టీ కొట్టు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.

చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఇష్టం

రమేశ్‌కు చిన్నప్పటి నుంచే క్రికెట్ అంటే చాలా ఇష్టం. క్రికెట్‌లో రాణించాలని దృఢ సంకల్పంతో ముందుకు సాగాడు. విద్యాభ్యాసం పూర్తి కాగానే క్రికెట్‌పై ఆసక్తి పెంచుకున్నాడు. ప్రతి రోజూ స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతూ ఎక్కువ సమయం కేటాయించేవాడు. క్రికెట్ ఆడటమే లోకంగా మారింది. అతడికి ఆటలపై ఉన్న ఆసక్తి చూసి కుటుంబ సభ్యులు సైతం ప్రోత్సహించారు. ఒక్కోసారి 5–20 వరకు ఆడేందుకు వెళ్తుంటాడని, ఎప్పుడు క్రికెట్, క్రికెట్ అంటూ ఉంటాడని చెబుతున్నారు. కుమారుడు దివ్యాంగుడు కావడం మొదట్లో కొంత మేర బాధ కలిగించినా సంతోషంగా పెంచుకున్నారు. నేడు క్రికెట్‌లో అంతర్జాతీయ స్థాయిలో రాణించడంతో కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయిలో పతకాలు

ఇప్పటి వరకు రమేశ్ డెఫ్ క్రికెట్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. రాష్ట్ర స్థాయిలో హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్‌తో పాటు జాతీయ స్థాయిలో ముంబాయి, గుజరాత్, పంజాబ్, చెన్నై, ఢిల్లీ, బెంగళూర్ తదితర ప్రదేశాలలో పాల్గొన్నాడు. యూరప్‌లోని యునైటెడ్ కింగ్‌డమ్‌లో అంతర్జాతీయ స్థాయిలో ఆడి ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. వివిధ ప్రదేశాల్లో ఆడిన మ్యాచ్‌లలో పతకాలతో పాటు ప్రశంసాపత్రాలు, కప్‌లు సాధించాడు. ఆల్ ఇండియా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ది డెఫ్ టీంలో ప్లేయర్‌గా పోటీల్లో పాల్గొంటున్నాడు. ఆల్ ఇండియా క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ది డెఫ్ ఆధ్వర్యంలో దుబాయ్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నాడు. ఏప్రిల్ 25 నుంచి మే 2 వరకు కొనసాగనున్నాయి.

పని చేయడంలోనూ పోటీ

క్రికెట్‌లో మంచి అవకాశాలు వచ్చినప్పుడు వెళ్లి మ్యాచ్‌లు ఆడుతుంటాడు. ఖాళీ సమయాల్లో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చిన్న హోటల్ పెట్టుకొని టీ అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మారుతున్న పోటీ ప్రపంచానికి అనుగుణంగా ప్రజల అభిప్రాయం మేరకు వారికి నచ్చేలా.. మెచ్చే విధంగా వివిధ రకాల టీలను తయారు చేస్తున్నాడు. ఈ విధంగా రోజుకి సుమారు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకు సంపాదిస్తున్నాడు.


క్రికెట్ టీమ్‌తో రమేశ్



న్యాల్‌కల్‌లో హోటల్ వ్యాపారం చేస్తున్న రమేశ్

దంపతులిద్దరూ ఒకే రకంగా..


భార్యతో రమేశ్

బోడ రమేశ్‌తో పాటు భార్య కీర్తన కూడా పుట్టుకతోనే చెవులు వినిపించకపోవటంతోపాటు మాటలు రావు. ఝరాసంగం మండల పరిధిలోని బర్దీపూర్ గ్రామానికి చెందిన ఆమెను ప్రేమించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. వీరికి ఒక పాప ఉంది.

క్రికెట్ అంటే ఇష్టంతోనే..

నాకు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఎంతో ఇష్టం. ప్రతీ క్రికెట్ పోటీల్లో పాల్గొనేవాడిని. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిల్లో సైతం పాల్గొంటున్నాను. ప్రభుత్వం మా లాంటి క్రీడాకారులకు సహకరించాలి. మా కుటుంబ సభ్యులు సైతం అన్ని విధాలుగా సహకరిస్తారు. ఖాళీ సమయాల్లో హోటల్ నడుపుతున్నాను.

– బోద రమేశ్, క్రికెట్ క్రీడాకారుడు, న్యాల్‌కల్

ఆర్థిక సహాయం అందించాలి

క్రికెట్‌లో సాధారణ వ్యక్తుల లాగా ఉత్తమ ప్రతిభ రాణిస్తున్న డెఫ్ క్రీడాకారులను ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని క్రీడాకారులతోపాటు డెఫ్ అసోసియేషన్ సభ్యులు కోరుతున్నారు. మ్యాచ్‌లు ఆడేందుకు నిర్వహణ ఖర్చులకు ప్రభుత్వంతోపాటు దాతల సాయం కోసం ఎదురు చూడాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.

ఆ నిర్మాణాలపై విచారణ జరపండి

- యాదవ సంఘం సభ్యుల ఫిర్యాదు
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌పై ఆరోపణలు


వినతి పత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

మిరుదొడ్డి(దుబ్బాక): అసలైన లబ్ధిదారుల పేరుతో కళ్లాలు నిర్మించి మరొకరికి కేటాయించడంపై అధికారులు వెంటనే విచారణ జరిపి న్యాయం చేయాలని అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రానికి చెందిన శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎంపీడీఓలు గణేశ్‌రెడ్డి, జయపాల్ రెడ్డికి శనివారం వినతి పత్రం అందించారు. గ్రామంలో 16 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి ఒక గుంటలో 16 సీసీ కళ్లాలను ఏర్పాటు చేసినప్పటికీ, అసలైన వారికి కాకుండా మరో సంఘం సభ్యులకు కేటాయించడం సరికాదన్నారు. మాజీ సర్పంచ్‌తో పాటు, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఏకపక్షంగా వ్యవహరిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కళ్లాల విషయంలో అధికారులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు యాదయ్య, పరశురాములు, దుర్గయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ విషయంపై చైర్మన్ బక్కి వెంకటయ్యను వివరణ కోరగా తనపై చేస్తున్న ఆరోపణలు సరికాదన్నారు. శ్రీ కృష్ణ యాదవ సంఘంలోని 16 మందికి నిధులు మంజూరైనప్పటికీ వారు కళ్లాలు నిర్మించుకోలేదని, మరో వర్గానికి చెందిన 16 మంది ముందుకు వచ్చి నిర్మాణాలు పూర్తి చేసుకుకోవడంతో ఎస్ఆర్ఈజీఎస్ అధికారులు వారికే కేటాయించారని వివరించారు. శ్రీ కృష్ణ యాదవ సంఘం సభ్యులు ముందుకు వస్తే 16 గుంటల్లో సీసీ కళ్లాలు నిర్మించుకోవడానికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే



విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

దుబ్బాకటౌన్‌: ప్రస్తుత సమాజంలో కనుమరుగవుతున్న మానవ సంబంధాలు, కుటుంబ బంధాల గురించి పిల్లలకు నేర్పేందుకు గ్రాండ్ పేరెంట్స్ డే లాంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయని ఎంఈఓ జోగు ప్రభుదాస్ అన్నారు. స్థానిక సరస్వతి గ్లోబల్ పాఠశాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గ్రాండ్ పేరెంట్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు జరపడం చాలా అరుదని, యాజమాన్యాన్ని అభినందిస్తున్నామన్నారు. అనంతరం చిన్నారులు, వారి తాతయ్య, నానమ్మలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరెడ్డి, వ్యవస్థాపకులు చింతరాజు, శ్రీనివాస్, కనకారెడ్డి, యాదగిరి, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

దొరికిన ఆభరణాలు అప్పగింత


బాధితురాలికి నగలు అప్పగిస్తున్న పోలీసులు

తూప్రాన్‌: తనకు దొరికిన రూ.10 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను యువతి పోలీసులకు అప్పగించింది. వివరాల్లోకి వెళ్తే.. మేడ్చల్ జిల్లా యాప్రాల్‌లోని బాలాజీనగర్‌కు చెందిన గరుగుల శిరీష శుక్రవారం తూప్రాన్ పట్టణ పరిధి బ్రహ్మణపల్లిలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి బయలుదేరింది. నర్సాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద బస్సు దిగి బ్రహ్మణపల్లికి చెందిన తన సోదరుడికి ఫోన్ చేసింది. అతడు కారులో ఇంటికి తీసుకెళ్లాడు. అయితే వెంట తీసుకొచ్చిన మూడు బ్యాగుల్లో రెండే కనిపించాయి. 8 తులాల బంగారు, ఐదు తులాల వెండి ఆభరణాలు కలిగి ఉన్న బ్యాగును మరిచిపోయింది. దీంతో వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాత్రి కావడంతో శనివారం ఉదయం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం రాత్రి శివ్వంపేట మండలానికి చెందిన సక్కుబాయి తూప్రాన్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పని చేస్తుంది. బస్సుకోసం నర్సాపూర్ చౌరస్తా వద్ద వేచి ఉన్న సమయంలో బ్యాగు కనిపించింది. అక్కడ ఎవరూ లేకపోవడంతో ఇంటికి తీసుకెళ్లింది. బ్యాగు తెరిచి చూసే సరికి అందులో బంగారు, వెండి ఆభరణాలు కనిపించాయి. ఎలాంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో శనివారం బ్యాగును పోలీసులకు అప్పగించింది. అప్పటికే బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో నగల బ్యాగును పోలీసులు బాధితురాలకి అప్పగించారు. నిజాయితీగా బ్యాగును అప్పగించిన సక్కుబాయిని అభినందించారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

కంది(సంగారెడ్డి): అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కంది మండలంలోని కలివేముల శివారులో శనివారం చోటు చేసుకుంది. ఇంద్రకరణ్ ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. కలివేముల శివారులోని వ్యవసాయ పొలం వద్ద ఓ వ్యక్తి మృతి చెంది ఉండడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతి చెందిన వ్యక్తి రామచంద్రపురం మండలం వెలిమేల గ్రామానికి చెందిన ఆశం గారి రాజు(37)గా పోలీసులు గుర్తించారు. మృతదేహం సమీపంలో ఓ మద్యం బాటిల్, మూడు గ్లాసులు ఉండడంతో ఎవరైనా చంపి వేశారా లేక ఏదైనా విషం తీసుకుని ఆత్మహత్య చేసుకున్నాడా అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రీ మృతి


బాల్‌రాజ్ (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): విద్యుదాఘాతంతో తాపీ మేస్త్రీ మృతిచెందిన సంఘటన అల్లాదుర్గంలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి కథనం ప్రకారం.. రేగోడ్ మండలం ఆర్. ఇటిక్యాలకు చెందిన ఉప్పరి నారాయణ, బాల్‌రాజ్ అన్నదమ్ముళ్లు. నారాయణ అల్లాదుర్గం ఐబీ చౌరాస్తా శివారులో ఇళ్లు నిర్మించుకుంటుండగా.. బాల్‌రాజ్ (39) పనులు చేస్తున్నాడు. అయితే నిర్మాణంలో ఉన్న ఇంటి ఎదుట 11 కేవీ విద్యుత్ తీగలు ఉన్నాయి. షట్టర్ నిర్మాణానికి ఇనుప చువ్వలు తీసుకెళ్తుండగా.. తీగలకు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై బాల్‌రాజ్ కిందపడ్డాడు. వెంటనే అతడిని స్థానికులు 108లో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

కూరగాయలు అమ్మి తిరిగొస్తుండగా...

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


కొమురయ్య (ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): కూరగాయలు అమ్మి ఇంటికి తిరిగొస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. బెజ్జంకి మండలం గుగ్గిళ్ల గ్రామానికి చెందిన సోము కొమురయ్య (58) రేగులపల్లి గ్రామంలో రోజులాగే కూరగాయలు విక్రయించి శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనంపై ఇంటికి తిరిగొస్తుండగా పల్లోట్టి స్కూల్ సమీపంలోని రాజీవ్ రహదారిపై హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొమురయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడు మహేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

కార్లు ఢీ.. మహిళ మృతి

పలువురికి తీవ్రగాయాలు


దివ్య మృతదేహం

జిన్నారం (పటాన్‌చెరు): ఎదురెదురుగా కార్లు ఢీకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్వర్ రెడ్డి కథనం ప్రకారం.. మెదక్ జిల్లా శివంపేట్ మండలం కొత్తపేట గ్రామానికి చెందిన శివరాంగౌడ్, శేఖర్ కారులో హైదరాబాద్‌కు వెళ్తున్నారు. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి కమాన్ వద్ద హైదరాబాద్ ఎస్ఆర్‌నగర్‌కు చెందిన అజయ్‌కుమార్, భార్య దివ్య, కూతురు మన్వితలతో గుమ్మడిదల వైపు నుంచి కారులో అతివేగంగా రాంగ్ రూట్‌లో వచ్చి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టారు. దీంతో శివరాంగౌడ్, శేఖర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. అజయ్‌కుమార్ భార్య దివ్యకు బలమైన గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతి చెందింది. అజయ్, కూతురు మన్వితకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఓఆర్ఆర్‌పై లారీ, కారు ఢీ

పటాన్‌చెరు టౌన్‌: రాంగ్ రూట్‌లో వచ్చిన లారీ.. కారును ఢీకొట్టిన ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ మల్లంపేటకు చెందిన సౌరబ్ శుక్రవారం రాత్రి తన కారులో హైటెక్ సిటీ నుంచి మల్లంపేట్ వెళ్తుండగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాటీ గ్రామ సమీపంలోని ఓఆర్ఆర్‌పై రాంగ్ రూట్‌లో వచ్చిన లారీ కారుని ఢీకొట్టింది. ఈ ఘటనలో సౌరబ్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరి మృతి


సురేందర్ మృతదేహం

టేక్మాల్(మెదక్): రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని బొడ్మట్‌పల్లి 161 హైవేపై శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. అల్లాదుర్గం మండలం ముప్పారం గ్రామానికి చెందిన సురేందర్ (34) బొడ్మట్‌పల్లి నుంచి ముప్పారం వైపు బైక్‌పై వెళ్తుండగా.. ఐబీ తండాకు చెందిన గణపతి బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో సురేందర్ తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. గణపతికి తీవ్రగాయాలు కావడంతో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

బైకులు ఢీకొని ఒకరి దుర్మరణం

నంగునూరు(సిద్దిపేట): రెండు బైకులు ఢీ కొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం రాత్రి పాలమాకులలో చోటు చేసుకుంది. పాలమాకుల గ్రామానికి చెందిన పిట్టల సత్యనారాయణ (35) వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి వస్తున్నాడు. ఈక్రమంలో జేపీ తండాకు చెందిన లవుడ్యా విజయ్ బైక్‌పై ఇంటికి వస్తుండగా పెద్దమ్మ దేవాలయం వద్ద రెండు బైకులు ఢీకొన్నాయి. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన గ్రామస్తులు ఇరువురిని సిద్దిపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే సత్యనారాయణ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడ్డ విజయ్ చికిత్స పొందుతున్నాడు.

రాష్ట్రస్థాయిలో సిద్దిపేట విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రస్థాయి ఇంగ్లిష్ ఒలంపియాడ్, ఉపన్యాస పోటీలలో జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాణించారని, అర్బన్ మండల విద్యాధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఇంగ్లిష్ ఒలంపియాడ్, ఉపన్యాస పోటీలు సంగారెడ్డి జిల్లా అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం జరిగాయన్నారు. ఈ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థిని సానియా సదాఫ్ రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచిందని, అలాగే మిగతా విద్యార్థులు కూడా రాణించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య

అల్లాదుర్గం(మెదక్): కడుపునొప్పి భరించలేక వృద్ధురాలు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అప్పాజీపల్లిలో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ దేవిదాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గౌబ్బురి పోచమ్మ (75) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుంది. ఈ క్రమంలో శనివారం తీవ్ర కడుపునొప్పి రావడంతో భరించలేక పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు 108లో జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచింది. మృతురాలి కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

కొల్చారంలో మరొకరు..


రవీందర్ (ఫైల్)

కొల్చారం(నర్సాపూర్): కడుపునొప్పి బాధ భరించలేక పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మండల కేంద్రంలోని గిరిజన తండాలో శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏఎస్ఐ తారాసింగ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లంబాడి రవీందర్ (27) మండల కేంద్రంలోని పోస్టాఫీస్‌లో బీపీఎంగా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఇటీవలే నొప్పి తీవ్రం కావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరాడు. చికిత్స కోసం అప్పటికే భారీ మొత్తంలో ఖర్చు చేసినా నయం కాకపోవడంతో శుక్రవారం ఇంట్లో పురుగు మందు సేవించాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా శనివారం ఉదయం మృతి చెందాడు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక రైతు..


లక్ష్మణ్(ఫైల్)

దుబ్బాకరూరల్‌: ఆర్థిక ఇబ్బందులు తాళలేక రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అక్బర్‌పేట భూంపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామ శివారులో జరిగింది. ఎస్ఐ హరీశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మాజీపేటకు చెందిన పూరి లక్ష్మణ్(49) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇటీవల ఇల్లు నిర్మించాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. శుక్రవారం రాత్రి 11గంటలకు పొలం వద్దకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడు. ఎంతకు ఇంటికి రాక పోవండతో శనివారం ఉదయం కుటుంబీకులు పొలం వద్దకు వెళ్లి చూడగా విగత జీవిగా కనిపించాడు. చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.